## 23 నుంచి పత్తి కొనుగోళ్లు

చెన్నూర్, జనవరి 21: చెన్నూర్ మార్కెట్ కమిటీ పరిధిలో సీసీఐ ఆధ్వర్యంలో ఈ నెల 23 నుంచి పత్తి కొనుగోళ్లను ప్రారంభిస్తున్నట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి పీ రామాంజనేయులు తెలిపారు. చెన్నూర్, కోటపల్లి, భీమారం, జైపూర్ మండలాల రైతులు పత్తి వాహనాలను జాతీయ రహదారి పక్కన ఉన్న కొత్త మార్కెట్ యార్డుకు వరుస క్రమంలో తీసుకురావాలని తెలిపారు. పత్తిలో తేమ శాతాన్ని పరీక్షించుకొని, టోకెన్ తీసుకొని మిల్లులకు వెళ్లి తూకం వేయించాలని తెలిపారు. తేమ 8 నుంచి 12 శాతమే ఉండేలా చూసుకోవాలని సూచించారు. ఒక్కో రైతు 40 క్వింటాళ్లకు మించకుండా తీసుకురావాలని తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 8 : 30 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు వచ్చిన వాహనాలకు టోకెన్స్ ఇవ్వనున్నట్లు తెలిపారు.

## 29న మోడల్ స్కూల్‌లో ఎన్నికలు

కాసిపేట, జనవరి 21 : కాసిపేట మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో ఈ నెల 29న మోడల్ స్కూల్ యాజమాన్య కమిటీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ అందె నాగ మల్లయ్య తెలిపారు. 20న ఓటరు జాబితా ప్రకటన, 22, 23వ తేదీల్లో అభ్యంతరాల స్వీకరణ, 24న తుది జాబితా విడుదల చేయనున్నట్లు తెలిపారు. 29న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ఉంటుందని, ఎన్నిక అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు మొదటి సమావేశం ఉంటుందన్నారు. ఓటర్లుగా తల్లి లేదా తండ్రి లేదా సంరక్షకుడు ఉంటారన్నారు.

## నేడు మండల పరిషత్ సమావేశం

హాజీపూర్, జనవరి 21 : మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం మండల ప్రజా పరిషత్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో అబ్దుల్ హై ఆదివారం తెలిపారు. ప్రజా ప్రతినిధులు, మండల అధికారులు తమ ప్రగతి నివేదికలతో సకాలంలో హాజరు కావాలని తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 18K. Ph: 9160900024/9640400073.
NT-319418-All

EDUCATION

★Admissions: రెగ్యులర్ & డిస్టెన్స్: డిగ్రీ, PG, B.Tech, M.Tech, D-Pharma, B.Pharma, B.Sc. (Agri.), B.Sc. (Nursing), B.Ed, B.Ped, MBA, MCA. Eligible for all Jobs. Ph: 8866977112, 339.
NT-319803-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
GST 5% వర్తించును
91827 77676, 91827 77679
91827 77671, 91827 77677

# శ్రీరాముడి వేడుకలకు ఆలయాలు ముస్తాబు

మందమర్రి: ముస్తాబైన పంచముఖి ఆంజనేయ ఆలయం

మందమర్రి, జనవరి 21: అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా సోమవారం మందమర్రి పట్టణంలో వేడుకలు నిర్వహించేందుకు ఆలయాలు ముస్తాబయ్యాయి. పాలచెట్టు ఏరియాలో పంచముఖి ఆంజనేయస్వామి ఆలయంతో పాటు మార్కెట్‌లోని భక్తాంజనేయ స్వామి ఆలయం, మూడవ జోన్‌లోని రామాలయం, బుర దగూడెం వద్ద గల కోరెగట్టు ఆంజనేయస్వామి ఆలయం, రామన్ కాలనీ, మారుతీనగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయాలు, యాపల్ ఏరియాలో కోదండ రామాలయంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించేందుకు ఆలయాలను పూలు, తోరణాలతో అలంకరించారు. సీతారామచంద్రుల వారి కల్యాణ మహోత్సవం, అయోధ్య అక్షింతలతో ఆశీర్వచనం, ద్విచక్ర వాహన శోభాయాత్ర, అభిషేకాలు, అర్చనలు, అన్నప్రసాద వితరణ నిర్వహించనున్నట్లు ఆయా ఆలయాల వేద పండితులు తెలిపారు. పట్టణంలోని అన్ని వీధుల గుండా శోభా యాత్రలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

బెల్లంపల్లి : కోదండరామాలయాన్ని శుభ్రం చేస్తున్న బీజేపీ నాయకులు

**కోదండ రామాలయంలో స్వచ్ఛ తీర్థ్ కార్యక్రమం**

బెల్లంపల్లి, జనవరి 21: పట్టణంలోని కోదండ రామాలయంలో ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో స్వచ్ఛ్ తీర్థ్ కార్యక్రమం నిర్వహించారు. ఆలయాన్ని అలంకరించారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ రాచర్ల సంతోష్‌కుమార్, పట్టి వెంకటకృష్ణ, ముడిమడుగుల శ్రీనివాస్, దార కల్యాణి, గోమాస కమల, ఉప్పులేటి సవ్రంతి, ముడిమడుగుల దీపారాణి, ఏముర్ల ప్రదీప్, దుగినే సాయికృష్ణ, తుమ్మ శ్రీపాల్, కంటేవాడ నగేశ్, భక్తులు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీరామాయణ మహాయాగం

యాగంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు దంపతులు

మంచిర్యాల అర్బన్, జనవరి 21 : అయోధ్య బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠాపనను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో శ్రీ సుదర్శన నరసింహ సహిత విశ్వశాంతి శ్రీ రామాయణ మహాయాగం రెండవ రోజూ కొనసాగింది. ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్ రావు, సురేఖ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. వివిధ పూజా కార్యక్రమాలతో పాటు రామాయణ శ్లోక సంపుటి హవనం, నిత్య పూర్ణాహుతితోపాటు సాయంత్రం లలితా సహస్ర నామ పారాయణం, దీపోత్సవం, సామూహిక భజన కార్యక్రమం నిర్వహించారు. మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఎమ్మెల్యే పీఎస్‌ఆర్ అన్నదానం నిర్వహించారు.

## పంచాయతీ కార్యదర్శుల ఫోరం ఎన్నిక

ఎన్నికైన కార్యవర్గం

హాజీపూర్, జనవరి 21 : తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల ఫోరం జిల్లా కమిటీ ఎన్నికలను ఆదివారం జిల్లాలోని తెలంగాణ నాన్ గెజిటెడ్ (టీఎన్జీవో) ఉద్యోగుల సంఘం భవన కార్యాలయంలో నిర్వహించిన ఎన్నికలకు ఎలక్షన్ ఆఫీసర్‌గా టీఎన్జీవో అసోసియేట్ అధ్యక్షుడు శ్రీపతి బాపురావు ఆధ్వర్యంలో ఎన్నికలను నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా ఎర్రోజుల చంద్రమౌళి, కార్యదర్శిగా పూదరి నరేందర్, అసోసియేట్ అధ్యక్షుడిగా కొంక నాగరాజు, కోశాధికారిగా ఎన్ శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా ఆవునూరి సుమన్, ఏ సత్యనారాయణ, ఈ క్రాంతి కుమార్, కల్చరల్ సెక్రటరీగా అశోక్, కార్యవర్గ సభ్యులుగా వెంకటస్వామి, సతీశ్, సురేశ్, సునంద ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి తెలిపారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి, టీఎన్జీవో ఫారెస్ట్ ఫోరం కేంద్ర సంఘం అధ్యక్షుడు పొన్న మల్లయ్య, మంచిర్యాల యూనిట్ టీఎన్జీవో అధ్యక్షుడు నాగుల గోపాల్, తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొడ్డు శ్రావణ్ కుమార్, సత్యనారాయణ హాజరయ్యారు.

## ఎస్సీ, ఎస్టీ, బీసీల అభివృద్ధే ధ్యేయం

- మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు గజ్జెల్లి లక్ష్మణ్

చింతల శ్రీనివాస్‌కు నియామక పత్రం అందిస్తున్న గజ్జెల్లి లక్ష్మణ్

భీమారం, జనవరి 21 : ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభివృద్ధే ధ్యేయంగా పని చేయాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు గజ్జెల్లి లక్ష్మణ్, రాష్ట్ర అధికారి ప్రతినిధి పైడిమల్ల నర్సింగ్ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో మాల మహానాడు, జై భీమ్ సైనిక్ దళ్ సమావేశాలు నిర్వహించి మండల కమిటీలను నియమించారు. మాల మహానాడు మండల అధ్యక్షుడిగా దాసరి ప్రకాశ్, జై భీమ్ సైనిక్ దళ్ మండల అధ్యక్షుడిగా చింతల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా కందుగుల రమేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సైనిక్ దళ్ రాష్ట్ర కన్వీనర్ అసాది పురుషోత్తం నాయకులు భూపెల్లిరాజం, అయిత మధునయ్య, కందుగుల మహేందర్, ఐత కమలాకర్, కందుగుల సంతోష్, భూపెల్లి లక్ష్మీ నారాయణ, చింతల కొమురయ్య, భూపెల్లి సత్యనారాయణ, శేనెల్లి రఘు తదితరులు పాల్గొన్నారు.

# చెన్నూర్‌లో కనుల పండువగా శోభాయాత్ర

శోభాయాత్రలో పాల్గొన్న మహిళలు

చెన్నూర్ టౌన్ /చెన్నూర్ రూరల్, జనవరి 21: చెన్నూర్ పట్టణంలో ఆర్యవైశ్య వాసవీ యూత్ ఆధ్వర్యంలో కనుల పండువగా శోభాయాత్ర నిర్వహించారు. అయోధ్యలో నేడు బాల రాముడి విగ్రహప్రతిష్ఠాపన కార్యక్రమం సందర్భంగా పట్టణంలో పుర వీధుల గుండా ఆదివారం శోభాయాత్ర తీశారు. ఈ సందర్భంగా వీధులన్నీ రామ నామ జపం, సంకీర్తనలతో మార్మోగాయి. ఈ కార్యక్రమంలో ఏవీజేవీ సభ్యులు నూక శ్రీనివాస్, తంగడిపల్లి సంతోష్, శివ, రాము, ఒల్లాల ఈశ్వర్, మంచాల శ్రావణ్, కే వేణు, సైకిల్ షాప్ అశోక్, విక్రం పలువురు సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## క్రికెట్ టోర్నమెంట్ విజేత కోటపల్లి..

ప్రథమ బహుమతి సాధించిన కోటపల్లి జట్టు

కోటపల్లి,,జనవరి 21 : వేమనపల్లి మండలం కేతనపల్లి యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ విజేతగా కోటపల్లి జట్టు నిలిచింది. ఫైనల్‌కు కోటపల్లి, వేమనపల్లి జట్లు వెళ్లగా హోరాహోరీగా జరిగిన మ్యాచ్‌లో కోటపల్లి విజయం సాధించింది. ప్రథమ స్థానంలో నిలిచిన కోటపల్లి జట్టుకు రూ.15వేల నగదు, జ్ఞాపిక, ద్వితీయ స్థానంలో నిలిచిన వేమనపల్లి జట్టుకు రూ.7500 నగదు, జ్ఞాపికలను నిర్వాహకులు అందజేశారు.

## అల్పాహారం అందించడం అభినందనీయం

- బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్ భుజంగరావు

బెల్లంపల్లి, జనవరి 21: భవన నిర్మాణ కార్మికులకు అల్పాహారం అందించడం అభినందనీయమని మున్సిపల్ కమిషనర్ భుజంగ రావు అన్నారు. బెల్లంపల్లి తిలక్ గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కాంటా చౌరస్తా వద్ద భవన నిర్మాణ కార్మికులు, కూలీలకు అల్పాహారం అందించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు కంటేవాడ నగేశ్ కుమార్, గెల్లి జయరాం యాదవ్, గంట శ్రీనివాస్, లింగాల రాజేశ్, ఎం.వెంకటరాజం, కందుల సత్తయ్య, కొయ్యడ శంకర్ గౌడ్, కనకయ్య గౌడ్, వెంకటస్వామి, మేకల రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

అల్పాహారాన్ని పంపిణీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ భుజంగరావు

## 25 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై..

- ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

సమావేశంలో పదో తరగతి(1999-2000 బ్యాచ్) పూర్వ విద్యార్థులు

జన్నారం, జనవరి 21 :మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1999–2000 సంవత్సరంలో పదో తరగతి చదివిన 120 మంది పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అప్పటి గురువులు ఎం కిషన్, పాపేశ్వరశర్మ, గంగన్న, మధుసూదన్, అంజిత్‌రావు, కట్ట రాజమౌళి, విజయ్‌కుమార్, లక్ష్మణ్, నరేందుల సత్తన్న, శకుంతల, రజనీని శాలువా కప్పి పూలమాలలతో సన్మానించారు. అనంతరం విద్యార్థులందరూ ఒకరినొకరు పలుకరించుకొని, యోగ క్షేమాలను తెలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు దుమల్ల రమేశ్, బచ్చలి కృష్ణ, ఎండీ అలీం, పర్ల శంకర్, పీ రమేశ్, సంతోష్, పీ సురేశ్, ఎస్ మహేశ్, రాజ్‌కుమార్, రమేశ్, సురేశ్, కవిత, వనిత, పావని, లక్ష్మి, వనిత, అన్వేష్ తదితరులు పాల్గొన్నారు

## పద్మశాలీ సంఘం సంతాప సభ

మందమర్రి, జనవరి 21: తెలంగాణ రాష్ట్ర పద్మశాలీ సంఘం(టీఆర్‌పీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు రామ్ శ్రీనివాస్ సంతాప సభను మందమర్రి పట్టణంలోని అంగడిబజార్ ఏరియాలో పద్మశాలీ సంఘం భవనంలో ఆదివారం సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. సంఘం నాయకులు శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పద్మశాలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొద్దుల బాపూజీ, జిల్లా అధ్యక్షుడు చిల్లగాని సుదర్శన్ మాట్లాడుతూ రామ్ శ్రీనివాస్ మరణం సంఘానికి తీరని లోటు అన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చెలిమెల అంజన్న, జిల్లా కోశాధికారి ఎన్నం లక్ష్మీనారాయణ, గాదాసు శంకరయ్య, ఉడుత చంద్రమౌళి, బండారు రాజేశం, మెండె భాస్కర్, మార్కండేయ, చిలగాని చంద్రయ్య, ఎన్నం రాజ్‌కుమార్, సత్యనారాయణ, బూర్ల రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు భీమారంలో చికెన్ సెంటర్ల బంద్

భీమారం, జనవరి 21 : అయోధ్యలో రామ్‌లల్లా విగ్రహ ప్రాణ ప్రతిష్ఠాపనోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం భీమారం మండల వ్యాప్తంగా చికెన్ దుకాణాలను బంద్ పాటిస్తున్నట్లు యజమానులు విలేకరుల సమావేశంలో తెలిపారు. విగ్రహ ప్రాణ ప్రతిష్ఠాపన సందర్భంగా ఆలయాల్లో సామూహిక రామనామ సంకీర్తనల కార్యక్రమ సందర్భంగా చికెన్ సెంటర్ల బంద్ పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నూతి నాగరాజు, కుమార్, రమేశ్, శీను, కొమ్ము నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

## కరసేవకులకు సన్మానం

కర సేవకుడు తంగిడిపల్లి శ్యామ్‌సుందర్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

చెన్నూర్ టౌన్ /చెన్నూర్ రూరల్, జనవరి 21: చెన్నూర్ పట్టణంలోని ఆర్యవైశ్య యూత్ ఆధ్వర్యంలో కర సేవకులను ఘనంగా సన్మానించారు. అయోధ్యలో బాల రాముడి ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని పురస్కరించుకొని శనివారం రాత్రి భజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. 1990 సంవత్సరంలో ఆయోధ్యలో కర సేవ కార్యక్రమంలో చెన్నూర్ నుంచి పాల్గొన్న సేవకులు మహేశ్ ప్రసాద్ తివారీ, తంగడిపల్లి శ్యామ్‌సుందర్, మారగోని మధూకర్‌తో పాటు పలువురిని సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. వారి సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య యూత్ నాయకులు వాసవీ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## 'సీఎంఆర్' ఒత్తిడితో దవాఖాన పాలైన మిల్లర్

ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్న వెంకటేశ్

మంచిర్యాల అర్బన్, జనవరి 21 : ప్రభుత్వానికి ఇవ్వాల్సిన సీఎంఆర్ బియ్యం అందించడంలో ఒత్తిడికి గురైన నీలం బ్రదర్స్ రైస్ మిల్లు యజమాని నీలం వెంకటేశ్ ఆదివారం పక్షవాతానికి గురై జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. 2022–23లో వానకాలం 1,726 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ ధాన్యం దించుకోగా ప్రభుత్వానికి 1, 157 మెట్రిక్ టన్నులు ప్రభుత్వానికి సీఎంఆర్ పెట్టాల్సి ఉండగా ఇప్పటి వరకు 258 (22 శాతం ) మెట్రిక్ టన్నులే అందించారు. ఈ విషయమై రెండు రోజుల క్రితం జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ ప్రత్యేక సమావేశం నిర్వహించి ఈ నెలాఖరులోగా ప్రభుత్వానికి బకాయి పడ్డ సీఎంఆర్ బియ్యం ఇవ్వాలని, లేదంటే ప్రభుత్వం తీసుకునే చర్యలకు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. తక్కువ సమయంలో ఇంత పెద్ద మొత్తంలో బియ్యం ఇవ్వడం సాధ్యం కాదని టెన్షన్‌కు గురై అనారోగ్యానికి గురైనట్లు సమాచారం. ఈ విషయమై ఆయన సోదరుడు నీలం శ్రీనివాస్‌ను 'నమస్తే' సంప్రదించగా 2022లో సుమారు పది వేల బస్తాల వరకు తడిసిన వడ్లు వచ్చాయని, ఈ విషయమై అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి స్పందన రాలేదని, అయినప్పటికీ రూ. 30 లక్షలు ఖర్చు పెట్టి షెడ్డు, రూ. 40 లక్షలు పెట్టి సార్టెక్స్ మిషన్‌లు పెట్టినప్పటికి ఆపరేటింగ్ సరిగ్గా తెలియక ఆలస్యమవుతుందని అధికారులకు తెలిపినా గడువులోగా బియ్యం పెట్టాలని ఒత్తిడి చేయడం ద్వారానే మా అన్నయ్యకు బీపీ ఎక్కువై కిందపడిపోయి, పెరాలసిస్ వచ్చిందని తెలిపారన్నారు. ఈ విషయమై జాయింట్ కలెక్టర్ మోతీలాల్‌ను వివరణ అడుగగా గతేడాది వాన కాలం సీజన్ నుంచి అంటే దాదాపు 13 నెలల కిందట మిల్లుల్లో దించుకొని ప్రభుత్వానికి సీఎంఆర్ ఇవ్వని మిల్లర్లకు ఇటీవలే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మీటింగ్ నిర్వహించామన్నారు. సంవత్సర కాలం నుంచి సీఎంఆర్ ఇవ్వాలని కోరుతున్నప్పటికీ పెట్టకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందనే భయంతో తనకు తానే టెన్షన్‌కు గురయ్యారని, ఏమైనా ఇబ్బంది ఉంటే ఇతర మిల్లులకు ధాన్యం షిఫ్ట్ చేసి సీఎంఆర్ పెట్టుకునే అవకాశం కూడా కల్పించామని, ప్రభుత్వానికి ఇవ్వాల్సిన బియ్యం ఇవ్వకుంటే వారి ఆదేశాల మేరకే చర్యలుంటాయని, వ్యక్తిగతంగా ఎవరినీ ఇబ్బంది పెట్టలేదని తెలిపారు.

## ఓటు హక్కు ఆవశ్యకతపై అవగాహన

అవగాహన కల్పిస్తున్న డీటీ ప్రసాద్

తాండూర్, జనవరి 21 : ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని గిరిజన గ్రామాల్లో డిప్యూటీ తహసీల్దార్ వీవీఆర్‌కేడీ ప్రసాద్ రెవెన్యూ సిబ్బందితో కలిసి ప్రజలకు అవగాహన కల్పించారు. తాండూర్ తహసీల్దార్ ఆదేశాల మేరకు ఆదివారం పీఎస్ నంబర్ 135, 134 బెజ్జాల, నర్సాపూర్ హాబీటేషన్ వాసాల మడ, బీర్సాయిగూడ గిరిజన గ్రామాల్లో ఓటరు జాబితాలో పేరు నమోదు, ఓటు హక్కు ప్రాధాన్యతను తెలుపుతూ కార్యక్రమం నిర్వహించారు. 18 ఏళ్ల వయస్సు నిండిన యువతీ యువకుల నుంచి ఓటరు నమోదు దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో బీఎల్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

## భారత్ వికసిత్ సంకల్ప్ యాత్ర

తాండూర్, జనవరి 21 : తాండూర్ గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో ఆదివారం భారత్ వికసిత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమాన్ని సర్పంచ్ నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు, తీసుకువచ్చిన ప్రజామోద పథకాలపై మొబైల్ ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా ప్రచారం చేశారు. యూనియన్ బ్యాంక్ అధికారులు ఖాతాదారులకు అందిస్తున్న వివిధ బ్యాంక్ స్కీములు, సేవలపై వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పూదరి నవీన్‌కుమార్, జడ్పీటీసీ సాలిగామ బానయ్య, కార్యదర్శి తపాస్‌కుమార్, వార్డు సభ్యులు, యూనియన్ బ్యాంక్ అధికారులు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, స్థానిక నాయకులు, అధికారులు, పంచాయతీ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న మున్సిపల్ కార్మికుల దీక్షలు

రిలే నిరాహార దీక్షల్లో కాంట్రాక్ట్ కార్మికులు

సీసీసీ నస్పూర్, జనవరి 21: నస్పూర్ మున్సిపాలిటీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ కాంట్రాక్ట్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు 4వ రోజుకు చేరుకున్నాయి. ఆదివారం రోజు మున్సిపల్ కార్మికులు అట్కాపురం లింగయ్య, , అట్కాపురం శ్రీనివాస్, జంగపెల్లి పోషం, ఏల్పుల నర్సయ్య, లింగయ్యతదితరులు దీక్షల్లో కూర్చున్నారు. కాంట్రాక్ట్ కార్మిక సంఘం నస్పూర్ మున్సిపాలిటీ అధ్యక్షుడు కొయ్యల వెంకటి దీక్షల్లో కూర్చున్నవారికి పూలమాలలేసి దీక్షలను ప్రారంభించారు. పలువురు కార్మికులు వీరికి మద్దతుగా దీక్షల్లో కూర్చొని సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా కొయ్యల వెంకటి మాట్లాడుతూ కార్మికులకు ప్రతి నెలా 1న జీతాలు, పెండింగ్ వేతనాలు చెల్లించాలన్నారు. కొత్తగా చేరిన కార్మికుల పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కోరారు. ఈపీఎఫ్ డబ్బులను పీఎఫ్ ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించకుంటే నిరవధిక సమ్మెలోకి వెళ్తామన్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని ఆయన కోరారు.

## ఆదివాసీల హక్కులను నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వాలు

- ఆదివాసీ హక్కుల పోరాట సమితి నాయకులు జేక శేఖర్


మాట్లాడుతున్న ఆదివాసీ హక్కుల పోరాట సమితి నాయకులు జేక శేఖర్

చెన్నూర్, జనవరి 21: ఆదివాసీల హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయని ఆదివాసీ హక్కుల పోరాట సమితి నాయకులు జేక శేఖర్ ఆరోపించారు. చెన్నూర్‌లోని ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం ఆయన మాట్లాడుతూ ఉట్నూర్‌లోని ఐటీడీఏ అధికారులు చెన్నూర్‌లో సెక్టోరియల్ కార్యాలయం ఏర్పాటు చేసి మైదాన ప్రాంతాల్లోని గిరిజనుల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మైదాన ప్రాంతాల్లోని గిరిజన గూడాల్లో వీటీడీఏ కమిటీలను ఏర్పాటు చేసి వీటి ద్వారా గిరిజనుల అభివృద్ధికి నిధులను విడుదల చేయాలని కోరారు. గిరిజనులకు ఇండ్లు, ఎడ్ల బండ్లు, బోరు బావులు, వ్యవసాయ పని ముట్లు ఇవ్వాలని కోరారు. మంచిర్యాలలో మినీ ఐటీడీఏ ఏర్పాటు చేయాలని కోరారు. లేదంటే మినీ ఐటీడీఏ సాధన కోసం పోరాటం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి నాయకులు చెడంక మాంతయ్య, పెద్దల వెంకటేశ్, ఆలం బాపు, బీస్కుల లక్ష్మణ్ పాల్గొన్నారు.

## కోలిండియా స్థాయి హాకీ పోటీల్లో విజేత సింగరేణి జట్టు..


హాకీ పోటీల్లో విజేతగా నిలిచిన సింగరేణి జట్టు

శ్రీరాంపూర్, జనవరి 21: బొగ్గు పరిశ్రమల కోలిండియా స్థాయి హాకీ పోటీల్లో చాంపియన్ షిప్ సాధించి కోలిండియా విజేతగా సింగరేణి జట్టు నిలిచింది. నాలుగు రోజులుగా సింగరేణి ఆతిథ్యంలో భూపాలపల్లిలో కోలిండియా ఇంటర్ హాకీ చాంపియన్ షిప్ టోర్నమెంట్ 2023–24 పోటీల్లో సింగరేణి జట్టు హోరాహోరీగా తలపడి చాంపియన్ షిప్‌తో గోల్డ్‌మెడల్ సాధించింది. సింగరేణి జట్టు కోలిండియా హాకీ పోటీల్లో రెండవ సారి 6 సంవత్సరాల తర్వాత తిరిగి చాంపియన్ షిప్ సాధించడంపై సింగరేణి కార్మికులు, అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 2017–18లో మణుగూరులో కోలిండియా హాకీ పోటీల్లో చాంపియన్ సాధించిన సింగరేణి క్రీడాకారులు తిరిగి భూపాలపల్లిలో జరిగిన కోలిండయా హాకీ పోటీల్లో విజయకేతనం ఎగురవేశారు. భూపాలపల్లిలో జరిగిన హాకీ పోటీల్లో 8 రాష్ట్రాల బొగ్గు పరిశ్రమల కార్మిక క్రీడాకారులు పాల్గొన్నారు. హోరా హోరీగా జరిగిన పోటీల్లో సెమీ ఫైనల్‌కు చేరిన సింగరేణి జట్టు సెమీ ఫైనల్‌లో సీసీఎల్ జట్టుతో పోరాడి సింగరేణి జట్టు 3 గోల్స్ చేసి విజయం సాధించి ఫైనల్‌కు చేరింది. ఫైనల్‌కు చేరిన సింగరేణి క్రీడాకారులు ఎన్‌సీఎల్‌తో పోరాడి 1–0 గోల్స్‌తో చాంపియన్ షిప్ సాధించారు. హాకీ పోటీల్లో చాంపియన్ షిప్ సాధించడంపై శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి హర్షం వ్యక్తం చేసి క్రీడాకారులను అభినందించారు. సింగరేణి టీంలో ఆరుగురు శ్రీరాంపూర్ ఏరియాకు చెందిన వారే కావడంపై సంతోషం వ్యక్తం చేశారు.

## 'వంశీకృష్ణారెడ్డి అకాల మరణం బాధాకరం'

బెల్లంపల్లి, జనవరి 21: బెల్లంపల్లిలో 23వ వార్డు మాజీ కౌన్సిలర్ తోడే వంశీకృష్ణారెడ్డి అకాల మరణం చాలా బాధాకరమని ఆయనతో చదివిని పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఆయన మృతికి సంతాప సూచకంగా ఆదివారం అమ్మ ఒడి ఎన్జీవో ఆధ్వర్యంలో రూరల్ బస్టాండ్ వద్ద నిరుపేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వంశీకృష్ణారెడ్డి మృతిపై ప్రగాఢ సంతాపం ప్రకటించారు. నాటి స్మృతులను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వాణి నికేతన్ ఉన్నత పాఠశాల 2002–03 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు, ఉపాధ్యాయులు, అమ్మ ఒడి ఎన్జీవో బ్రాంచ్ మేనేజర్ హన్మాండ్ల మధుకర్, సభ్యులు పాల్గొన్నారు.